

ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలు

బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.

8లో▸



టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలి

టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. మంచిర్యాలలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0 /27.0

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధ : 6:30 | సహర్ గురు : 4:43

న్యూస్‌రీల్

పూలే ఆశయాలను కొనసాగించాలి



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విప్ సుమన్, ఎంపీ వెంకటేష్, ఎమ్మెల్సీ విఠల్

చెన్నూర్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక పాత ఇంటి గ్రేడ్ మార్కెట్ ఎదురుగా పూలే విగ్రహానికి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండె విఠల్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మంచిర్యాలఅగ్రికల్చర్: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, సమాజంలో మార్పు కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతిభా పూలే చిత్రపటానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బీసీ జాగృతి ప్రతినిధి, హేమాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి ప్రభుత్వం చర్యలు

భీమారం/చెన్నూర్‌రూరల్: గతంలో డీడీలు చెల్లించిన వారికి గొర్రల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన భీమారం మండలం మద్దికల్, చెన్నూర్ మండలం సుద్దాల గ్రామాల్లో గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల అవగాహన సదస్సులో మాట్లాడారు. డీడీలు తీయని వారు డీడీలు తీసి మండల పశువైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఉడుత సంతోష్, సంఘం సంఘం మండల అధ్యక్షుడు కట్టవేణ రవి, సోషల్ మీడియా ఇంచార్జి కాటవేణ మహేష్, సొసైటీ అధ్యక్షుడు సంపత్, ప్రవీణ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వందుర్‌గూడలో కంటి వెలుగు బహిష్కరణ



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని వందుర్‌గూడలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు మంగళవారం బహిష్కరించారు. వైద్య సిబ్బంది గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో వైద్య సిబ్బంది ఎంపీడీవో, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు వినిపించుకోలేదు. వందుర్‌గూడ గ్రామ పంచాయతీ ఏర్పాటును రద్దు చేయాలని, అప్పటివరకు గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినా అడ్డుకుంటామని గతంలో చెప్పామని అన్నారు. వందుర్‌గూడ పంచాయతీ ఏర్పాటును రద్దు చేసి నెల్కివెంకటాపూర్‌లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎంపీడీవో మల్లేశంకు అందజేశారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు, వైద్యసిబ్బంది వెనుదిరిగారు. ఆదివాసీ సేనా నాయకుడు దౌలత్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కత్తి దూస్తున్న భూ తగాదాలు

- వివాదాస్పద భూములతో గొడవలు
- జిల్లాలో హద్దు మీరుతున్న భూ దందాలు



ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసిన ఇంటి నిర్మాణం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రియల్ ఎస్టేట్ వ్యాపారం వివాదాలు మనుషులపైకి కత్తులు దూస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. మంచిర్యాల సమీపంలోని రామకృష్ణాపూర్ పరిధి గద్దెరాగిడిలో ఉన్న చాకలివాడలో రియల్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు హత్యకు వివాదాలే కారణమయ్యాయి. గద్దెరాగిడిలోని ఓ స్థల వివాదంలో కొంత కాలంగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తనకు అమ్మిన స్థలాన్ని మరొకరికి అమ్మడం, కొనుగోలు చేసిన వ్యక్తి ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. దానిని అడ్డుకోవడంతోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థులు కత్తితో తలపై వేటు వేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి లక్ష్మీకాంతారావు మృత్యువాత పడ్డాడు. ఆయనకు రెండు మూడు చోట్ల భూ వివాదాలు ఉన్నాయి. తాజాగా జరిగిన దాడి గద్దెరాగిడికి సంబంధించిన వివాదానిదేనా లేక మరొకట అనేది స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పెరుగుతున్న భూ వివాదాలు

జిల్లాలో గత కొంతకాలంగా భూ వివాదాలు పెరిగిపోతున్నాయి. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో రోజురోజుకు సివిల్ వివాదాలపై ఫిర్యాదు చేసేందుకు వస్తున్నారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోబోమని చెబుతూనే కొన్ని చోట్ల అనధికార పంచాయితీలు నడుస్తున్నాయి. ఇక కొన్ని చోట్ల రాజకీయంగా పలుకుబడి ఉన్నవారితోపాటు మధ్యవర్తులు సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. జిల్లాకేంద్రంతోపాటు శివారు ప్రాంతాలైన నస్పూర్, గద్దెరాగిడి, పాతమంచిర్యాలను ఆనుకుని ఉన్న సమీప ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి. క్రయవిక్రయాలు, హద్దులు, యజమానుల మధ్య వివాదాలు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా అసైన్డ్, సీలింగ్ తదితర భూముల్లో ఒకరినిమించి మరొకరు అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో రియల్ దందాలో హత్యకు దారి తీస్తున్నాయి. గతంలో మంచిర్యాల పట్టణం రైల్వేబ్రిడ్జి సమీపంలో ఇంట్లోనే ఓ రియల్ వ్యాపారి బొద్దున రామస్వామిని ప్రత్యర్థులు తుపాకితో కాల్చి చంపారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం రేపింది. ఆ తర్వాత హత్యల వరకు వెళ్లిన ఘటనలు తక్కువ. పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు, పంచాయితీలు జరుగుతున్నాయి.

కొనుగోలుదారులలారా బహుపరాక్ !

తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో కొందరు వివాదాస్పద స్థలాలతోనే వ్యాపారం చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల లాబీయింగ్, లాయర్లతో కేసులు వేయిస్తూ తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇవి తెలియకుండా కొనుగోలు చేసిన కొందరు ఇరుకున పడుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం, రాజీవ్‌నగర్, రామక్రిష్టాపూర్ పట్టణం గద్దెరాగిడి, నస్పూర్, పాతమంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్ భూములతోపాటు ప్రైవేటు వ్యవసాయ భూములు, వారసత్వ గొడవలు, కోర్టులో ఏళ్లుగా నలుగుతున్నాయి. వీటినే కొందరు రియల్ వ్యాపారులు, నిర్మాణదారులు కొనుగోలు చేస్తూ క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఇరువర్గాల్లో గొడవలు ఏర్పడి వివాదాలకు దారి తీస్తున్నాయి. గతంలో కొందరు పోలీసు ఉన్నతాధికారులు, రియల్ వ్యాపారులు, మధ్యవర్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సర్వే నంబర్లు, అసైన్డ్ భూములు కొనుగోలు చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వాటిని మర్చిపోయి యథేచ్ఛగా భూ దందాలు చేస్తుండడంతో నేరాలకు కారణం అవుతున్నాయి. ఈ క్రమంలో భూ కొనుగోలుదారులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

రియల్ వ్యాపారి దారుణహత్య

- కత్తులతో హతమార్చిన దుండగులు
- ఘటనా స్థలిని పరిశీలించిన డీసీపీ, ఏసీపీ



హత్యకు గురైన లక్ష్మీకాంతరావు



లక్ష్మీకాంతరావు(ఫైల్)

రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన సంచలనం సృష్టించింది. మంగళవారం ఉదయం 11.15గంటల ప్రాంతంలో మంచిర్యాల ఆర్పీ రోడ్డు ప్రాంతానికి చెందిన నడిపెల్లి లక్ష్మీకాంతారావు(61)పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి చంపారు. రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోకి వచ్చే గద్దెరాగిడి గ్రామం చాకలివాడలోని ప్లాట్ల వద్ద ఈ దాడి జరిగింది. తలపై తీవ్ర గాయాలైన అతడిని 108అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, పట్టణ ఎస్సై అశోక్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి.

పోలీసుల అదుపులో పలువురు..?

సంచలనం సృష్టించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు హత్య కేసులో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఒక భూమి కొనుగోలు విషయంలో తలెత్తిన వివాదం హత్యకు దారి తీసిందనే చర్చ జరుగుతోంది. గద్దెరాగిడి ప్రాంతానికి చెందిన కూనారపు మల్లేష్ వద్ద లక్ష్మీకాంతారావు అదే ప్రాంతంలో భూమి కొనుగోలు చేసి కొంత డబ్బులు కూడా చెల్లించాడు. మల్లేష్ అదే భూమిని మరొకరికి కూడా అమ్మినట్లు పోలీసుల ప్రాథమిక సమాచారంలో తేలింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్య వివాదం కాస్త ముదిరింది. తనకు అమ్మిన స్థలంలో కట్టడాలు కూడా ప్రారంభించడంతో లక్ష్మీకాంతరావు మల్లేష్‌ను పలుమార్లు నిలదీసినట్లు చెబుతున్నారు. కాగా, వివాదానికి తెరదించుదామని, ఈ విషయాన్ని కూర్చుని మాట్లాడుదామని పిలిపించగా మాటామాట పెరిగి హత్యకు దారితీసిందని సమాచారం. లక్ష్మీకాంతారావుకు చెందిన వ్యక్తులు నిర్మాణ స్థలంలో కొంతవరకు సెంట్రింగ్‌ను కూల్చివేసినట్లు తెలిసింది. కాగా, పథకం ప్రకారమే కత్తులతో దాడి చేసి హత్య చేశారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనకు సంబంధించి పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, లక్ష్మీకాంతరావు వద్ద అప్పుడప్పుడు డ్రైవర్‌గా పనిచేసే మామిడి శ్రీనివాస్ ఉదయం లక్ష్మీకాంతారావు ఇంటికి వచ్చి లక్ష్మీకాంతారావు ఎక్కడ ఉన్నాడని అతడి భార్య పద్మను అడిగాడని ప్లాట్ వద్దకు వెళ్లినట్లు సమాచారం ఇవ్వడం.. ఆ తర్వాతే లక్ష్మీకాంతారావుపై దాడి జరగడంతో మామిడి శ్రీనివాస్‌పై కూడా అనుమానం ఉన్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, పోలీసులు కేసును సీరియస్‌గానే తీసుకుని విచారణ చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బృందాలు సైతం వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- బహిరంగ సభాస్థలం పరిశీలన



నస్పూర్‌లోని సభాస్థలిని పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, నాయకులు

నస్పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నస్పూర్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న జై సత్యాగ్రహ సభ స్థలాన్ని మంగళవారం వారు ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నెమిండ్ల శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి బొగ్గు బ్లాకుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒకరిపైఒకరు నెపం నెట్టుకుంటూ డ్రామాలు ఆడుతూ కార్మికులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అదానీ, మోదీ మధ్య సంబంధాన్ని రాహుల్ గాంధీ ప్రశ్నించినందుకే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించారని పేర్కొన్నారు. నస్పూర్‌లో నిర్వహించే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హాజరవుతారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రజలు కార్మికులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, జగిత్యాల, హన్మకొండ డీసీసీ అధ్యక్షులు ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్, నాయిని రాజేందర్‌రెడ్డి, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్ సురిమిల్ల వేణు, నాయకులు శ్రీపతి మల్లేశ్, తాల్ల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

'భట్టి'తో నాయకుల భేటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో శిబిరంలో ఉన్న సీఎల్పీ నేత విక్రమార్కతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు భేటీ అయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, నాయకులు పీపుల్స్ మార్చ్ పాదయాత్రపై చర్చించారు. సత్యాగ్రహ సభ ఏర్పాట్లు, జనసమీకరణపై చర్చించారు. ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



కుటుంబసభ్యులతో కలిసి వెళ్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

- 99.43 శాతం విద్యార్థులు హాజరు
- 58మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిసాయి. ఈసారి ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాకుండా పరీక్షలు సాఫీగా సాగాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పేపర్ పరీక్షకు 10,135మంది విద్యార్థులకు గాను 10,077 మంది 99.43శాతం హాజరు కాగా.. 58మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 10,125మందికి గాను 10,072మంది హాజరు కాగా.. 53మంది పరీక్షకు రాలేదు. గతంలో ఫెయిలైన విద్యార్థులకు పది మందికి గాను ఐదుగురు హాజరయ్యారు. డీఈవో వెంకటేశ్వర్లు మూడు పరీక్ష కేంద్రాలు, ఫ్లయింగ్‌స్క్వాడ్ 25 పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు. ఈ ఏడాది ముందస్తుగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్, నీటి సౌకర్యం, బల్లలు, విద్యార్థులు సమయానికి వచ్చేలా రవాణా సౌకర్యం కల్పించారు.

విద్యార్థుల్లో ఆనందం

క్షణం తీరిక లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఆనందంలో మునిగితేలారు. పరీక్ష కేంద్రాల వద్ద వేచి చూస్తున్న కుటుంబ సభ్యుల వద్దకు చిరుదరహాసాలతో వచ్చారు. చివరి రోజు కావడంతో మళ్లీ ఎప్పుడు కలుస్తామోనని విద్యార్థులు స్నేహితులతో సెల్ఫీలు దిగి టాటాలు చెప్పుడుకోవడం కనిపించింది. కబుర్లు చెప్పుకుని వీడ్కోలు తీసుకున్నారు. హాస్టల్‌లో ఇంత కాలం చదువే లోకంగా మారిన విద్యార్థులు పరీక్షలు పూర్తి కావడంతో పెట్టె సర్దుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిబాట పట్టారు.

నక్సల్స్ పేరుతో అభివృద్ధి జరగనివ్వలే..!

- నాలుగేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, వేదికపై ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్సీ విఠల్, భాగ్యలక్ష్మి

చెన్నూర్: నక్సల్స్ ప్రభావిత ప్రాంతమని చెప్పి విపక్ష పార్టీలు అరవై ఏళ్లుగా చెన్నూర్ అభివృద్ధి జరగనివ్వలేదని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విమర్శించారు. స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ చెన్నూర్ మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో పెద్దయెత్తున నిధులు తీసుకొచ్చి నాలుగేళ్లలో చెన్నూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. చెన్నూర్ నియోజకవర్గానికి పురాణ చరిత్ర ఉందని, సేవ చేసే భాగ్యం లభించడం తన అదృష్టమని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి చెన్నూర్ పట్టణమే ఉదాహరణగా పేర్కొన్నారు. నియోజకవర్గంలో పాదయాత్రలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు చెన్నూర్‌కు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని, కార్యకర్తలు గ్రూప్ రాజకీయాలు చేయకుండా ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. చెన్నూర్ మండలంలో వంతెనలు, రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, రైతు వేదికలు, అంగన్‌వాడీ సెంటర్లు, క్రీడా ప్రాంగణాలు, మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి చేశామని తెలిపారు. ఎంపీ వెంకటేశ్‌నేత మాట్లాడుతూ బాల్క సుమన్ పట్టుదల గల ఎమ్మెల్యే అని, అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయడని అన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాడని తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమ్మేళనాలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, రైతు బంధు సమితి అధ్యక్షుడు సమ్మిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు కార్యాచరణ చేపట్టాలి

- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి ధాన్యం సేకరణకు అధికారులు కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం నస్పూర్ మండలంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ నాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం తరలిరాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని సూచించారు. గత సీజన్ ధాన్యాన్ని బకాయి ఉన్న రైస్‌మిల్లర్లకు కేటాయించకూడదని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణ, డీసీఎమ్మెస్ డీఎం పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం రోడ్డు–భవనాల శాఖ ఈఈ రాముతో కలిసి కలెక్టరేట్‌లో కార్యాలయాల గదులు, కలెక్టర్ చాంబర్, అర్జీదారులు, సందర్శకులు వేచి ఉండే గది, తాగునీరు, విద్యుత్ ఏర్పాటు పనులు పరిశీలించారు. పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 58, 59 కింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడిగించిందని తెలిపారు. క్రమబద్ధీకరణ వర్తించే తేదీని 2020 జూన్ వరకు పొడిగించదని తెలిపారు. గతంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉపకరణాలకోసం దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులు 2022–23 ఆర్థికసంవత్సరానికి గానూ ఉపకరణాలకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం రిట్రో ఫీటెడ్ మోటార్ వెహికిల్స్, బ్యాటరీ వీల్‌చైర్స్, ల్యాప్‌టాప్‌లు, 4జి స్మార్ట్‌ఫోన్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 25 లోగా ఆన్‌లైన్‌లో https:// tsobmms .cgg. gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల్లోపు ఉన్నవారు అర్హులని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న వారు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తులను జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తాండూర్(బెల్లంపల్లి): మతిస్థిమితంలేని మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ ఐబీ ప్రాంతం నుంచి రేపల్లెవాడకు వెళ్లే రోడ్డుమార్గంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆసిఫాబాద్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన పూదరి అమృత (40) అక్కడికక్కడే మృతి చెందింది. నాలుగేళ్లుగా సదరు మహిళ మతిస్థిమితం కోల్పోయి రోడ్లవెంట తిరుగుతోంది. మృతురాలి తండ్రి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టులు లొంగిపోవాలని పోస్టర్లతో ప్రచారం



పోస్టర్ అంటిస్తున్న పోలీసులు

కోటపల్లి(చెన్నూర్): మావోయిస్టులు వనాలు వీడి జనాల్లోకి రావాలని సరికొత్త కార్యక్రమాలతో కోటపల్లి పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మావోయిస్టు అగ్రనేతలు, వారిపై ఉన్న రివార్డులను ఫొటోలతో సహా ముద్రించి గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో అతికిస్తూ ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

'నా భూమి నాకు ఇప్పించాలి'




మాట్లాడుతున్న సూరిబాబు

బెల్లంపల్లి: పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట టకారియానగర్‌లో తాను కొనుగోలు చేసిన రెండు గుంటల భూమిని కబ్జా చేసి తనకు అన్యాయం చేస్తున్నారని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్త మారి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తన భూమిని సాన శ్రావణ్ అనే వ్యక్తి కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాడన్నారు. భూ ఆక్రమణపై హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి గతంలో కట్టడాన్ని కూల్చివేసి భవిష్యత్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

అభాగ్యులకు అభయం!

- ఆర్థిక భరోసాకు 'మిషన్ వాత్సల్య'
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు
- ఇతర కారణాలతో అనాథలైన వారికి నెలకు రూ.2 వేల ఆర్థికసాయం అందజేత



మంచిర్యాలటౌన్: తల్లిదండ్రులను కోల్పోయి అభాగ్యులైన పిల్లలకు మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో అనాథలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడి, పేదరికంతో ఇంటిపెద్దను కోల్పోయిన వారు, ఇతరత్రా కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న 56 మందికి, హెచ్‌ఐవీ, తలసేమియా, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఆరుగురికి ప్రతీనెల రూ.2 వేల చొప్పున అందిస్తున్నారు. కరోనా సమయంలో తల్లి లేదా తండ్రి, ఇద్దరినీ కోల్పోయిన జిల్లాలోని ఆరుగురు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా నెలకు రూ.4 వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. కుమురం భీం జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు చిన్నారులకు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం కింద రెండు సంవత్సరాలుగా రూ.4వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు సాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా అందరికీ రూ.4 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి మాత్రం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలు అందిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎంపిక ఇలా..

అర్హులైన వారు స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించడంతో పాటు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, బాలల సంరక్షణ విభాగంలోనూ సంప్రదించాలి. వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీవో, ఎన్‌ఐసీ పీవో, శిశు, గృహ సంక్షేమాధికారి, జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన అధికారి, తదితర సభ్యులున్న కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు.

జత చేయాల్సిన పత్రాలు

జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తల్లి, లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్ (సంరక్షకుడు) ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ వివరాలు, వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి లేదా సంరక్షకులతో జాయింట్ అకౌంట్.

ఆర్థికసాయం అందిస్తున్నాం



మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఆరుగురు పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథలుగా మారిన, పేదరికంతో ఉంటూ ఇంటిపెద్దను కోల్పోయిన, విడాకులు పొందిన, ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డ తల్లిదండ్రులు ఉన్న పిల్లలు 62 మందికి చదువుకోసం ప్రతీనెల రూ.2 వేల ఆర్థికసాయం అందిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల

అర్హులు వీరే

ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్పాన్సర్‌షిప్‌ను కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), తల్లిదండ్రులు విడాకులు పొందిన వారి పిల్లలు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, ఇల్లులేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహం, హెచ్‌ఐవి బాధిత, పీడిత బాలలు, తలసేమియా వ్యాధి బారిన పడ్డ బాలలకు పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించరాదు. ఈ పథకానికి ఎంపికైన వారు ఇంటినుంచి పాఠశాలకు వెళ్తే ఆర్థిక సాయం ఇవ్వనున్నారు. చదువు మధ్యలో ఆపేస్తే ఆర్థికసాయం నిలిపివేస్తారు. ఈ పథకం ద్వారా కేవలం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలను ఇస్తుండగా, మిగతా వారికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయంను అందిస్తున్నారు.

ఐదుగురికి కరోనా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే పది మంది కరోనా వైరస్ బారినపడ్డారు. మంగళవారం జిల్లాలో 54 మందికి పరీక్షలు నిర్వహించగా 49 మందికి నెగిటివ్ వచ్చింది. జైనథ్ మండలం సావాపూర్ గ్రామానికి చెందిన ఏడాది బాలిక, మాండగడలో యాభైఏళ్ల వ్యక్తికి, నార్నూర్‌లో ఏడాది బాలుడు, ఉట్నూర్ మండలం సాలెవాడలో యాభైఏళ్ల మహిళ, గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధునికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం 13 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రిమ్స్‌లో ముగ్గురు, హోం ఐసోలేషన్‌లో పదిమంది చికిత్స పొందుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడడంతో కోర్టులో హాజరుపరిచారు. 23మందికి రూ.32,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడికల్ జడ్జి తీర్పుఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఐదుగురు వ్యక్తులతో పాటు పలు పశువులు, పెంపుడు కుక్కలపై మంగళవారం ఓ పిచ్చికుక్క దాడికి పాల్పడింది. గ్రామానికి చెందిన కమ్మరి రాజేందర్, జంగిలి అంజలి, తుమ్మ నర్సయ్య, వేల్పుల శ్యాం, గాజుల నర్సవ్వతో పాటు గ్రామంలోని పలుదూడలు, పెంపుడు కుక్కలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు శునకాన్ని చంపివేశారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

గనులపై పూలే జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ఏజెంట్ సత్యనారాయణ

శ్రీరాంపూర్(మంచిర్యాల): మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకలను సింగరేణి గనులపై మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కే 7 గనిపై నిర్వహించిన వేడుకల్లో గ్రూపు ఏజెంట్ సత్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సామాజిక తత్వవేత్త అన్నారు. నాటి సమాజంలోని అనేక రుగ్మతులకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. మహిళలకు విద్య ప్రాముఖ్యతను వివరించి అనేక పాఠశాలలను ఏర్పాటు చేయించారనాన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సాయిప్రసాద్, అసోసియేషన్ నాయకులు, మెండె వెంకటి, అశోక్, రౌతు సత్యనారాయణ, మోత్కూరి కొమురయ్య, గొర్ల సంతోశ్, పొగాకు రమేశ్ పాల్గొన్నారు. ఆర్కే 5 గనిపై నిర్వహించిన కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, ఎస్సార్పీ 1 గనిపై మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎస్సార్పీ 3 గనిపై కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. ఆర్కే 6 గనిపై పెట్టం లక్ష్మణ్, ముస్కె సమ్మయ్యల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయా గనులపై జరిగిన కార్యక్రమాల్లో అసోసియేషన్ నాయకులు పెట్టం శ్రీనివాస్, వెంగళ కుమారస్వామి, అద్దు శ్రీనివాస్, ఎంబడి తిరుపతి, బూస రమేశ్, నీలం సదయ్య, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, సదానందం, గడ్డం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను కాటేసిన విద్యుత్

- ఫీజు సరిచేస్తుండగా షాక్ తగిలి రైతు మృతి
- పెగడపల్లిలో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



రాంరెడ్డి(ఫైల్)

జైపూర్(చెన్నూర్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను చివరిదశలో కాపాడుకునేందుకు పంటపొలానికి వెళ్లిన రైతును విద్యుత్ రూపంలో మృత్యువు కాటేసింది. జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన రిక్కుల రాంరెడ్డి(45), జయ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో తమకున్న ఐదెకరాలతో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట గింజదశకు చేరుకుంది. పంటకు నీరు పెట్టేందుకు సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్లాడు. 12 గంటలకు త్రీఫేజ్ కరెంట్ వచ్చింది. బోరునుంచి నీళ్లు రాకపోవడంతో స్టార్టర్ డబ్బా తీసి ఫీజులు సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లిచూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు జితేందర్‌రెడ్డి, కుమార్తె ప్రత్యూష ఉన్నారు.

నకిలీ వైద్యుల చెలగాటం..!

- పేరొకరిది.. వైద్యం మరొకరిది..!
- భైంసాలోని ఓ ఆస్పత్రిలో వెలుగుచూసిన ఘటన



మాట్లాడుతున్న బాధితుడు కోర్వ సచిన్

భైంసాటౌన్(ముధోల్): భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నకిలీ వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు), చర్మసంబంధ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన కోర్వ సచిన్ సోమవారం చర్మసంబంధ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి సంబంధిత వైద్య నిపుణులు రాజేశ్ కోసం అడిగారు. ఓపీ చీటితో వైద్యం కోసం లోనికి వెళ్లగా రాజేశ్‌కు బదులు మరోవ్యక్తి వైద్యం అందించడంపై అనుమానించాడు. మీరు డాక్టర్ రాజేశ్ కాదు.. మీ పేరేంటని ప్రశ్నించగా తన పేరు రాజు అని చెప్పినట్లు తెలిపాడు. అప్పటికే అక్కడ ప్రిస్క్రిప్షన్‌పై రాజేశ్ పేరు ఉందని, మీరు ఆయన పేరిట ఎలా వైద్యం చేస్తున్నారని బాధితుడు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదన్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్యులను అరికట్టాలని కోరారు. నకిలీ వైద్యంపై డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు మధ్యలో ఉన్న స్తంభాలను సంబంధిత అధికారులు సకాలంలో తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఓ లారీ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పాక్షికంగా దెబ్బతిని పెను ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు స్పందించి మరో స్తంభం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార 'బంక్'ల కథ కంచికేనా?

- మూతబడుతున్న వినియోగదారుల పెట్రోల్ బంకులు
- ఆర్థిక నష్టాల్లో సహకార సంఘాలు
- అగమ్య గోచరంగా బంకుల నిర్వహణ



మూతపడిన తాండూర్ పెట్రోల్ బంక్

తాండూర్(బెల్లంపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణ గాడితప్పింది. వాటి నిర్వహణపై పాలకవర్గానికి, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఆదిలోనే బంకులు మూతపడే పరిస్థితులు దాపురించాయి.

ధరలో వ్యత్యాసం..నిర్వహణ భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 7 సహకార సంఘాల తరఫున పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని 2017లో ప్రతిపాదనలు చేశారు. 2018లో కడెం, అంగీర్గా, తానూరు, కుభీర్, తాండూర్‌లలో ప్రారంభించారు. బంకుల స్థాపనకు డీసీసీబీ నుంచి రూ.40 లక్షల వరకు రుణం తీసుకున్నారు. స్థలానికి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లిస్తామని లీజుకు తీసుకున్నారు. సహజంగా వినియోగదారుల పెట్రోల్ బంకుల్లో ధర కాస్తా తక్కువగా ఉంటుందని వినియోగ దారులు భావిస్తారు. కానీ ప్రైవేట్ బంకుల కంటే లీటర్ పెట్రోల్ రూ.18, డీజిల్ రూ.20 వరకు అధికంగా ఉండడంతో వినియోగదారులు అటువైపు వెళ్లడం మానేశారు. దీంతో గిరాకీ లేక, నిర్వహణ కొరవడి బంకులు మూసివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్‌లోని పెట్రోల్ బంక్‌ను మండల కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఏమాత్రం గిరాకీ లేక మూతపడింది. తానూర్, కుభీర్, కడెం పెట్రోల్ బంక్‌లను కమర్షియల్ బంక్‌లుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో రెండు నెలల క్రితం పునఃప్రారంభించి పెట్రోల్ అమ్మకాలు మాత్రమే సాగిస్తున్నాయి. కొత్తగా జన్నారం, చింతగూడలో వినియోగదారుల బంక్‌లను కమర్షియల్ బంక్‌ల పేరుతో ఏర్పాటు చేయడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెట్రోల్‌బంక్‌ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాండూర్ బంక్‌ను కమర్షియల్ చేసుకోవాలని లేదంటే మరో ప్రాంతానికి తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ రెండు పద్ధతులు కూడా ఆర్థికభారంతో కూడుకున్నవి కావడంతో అంతిమ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నాం.

– శ్రీనివాస్, సీఈవో, పీఏసీఎస్, తాండూర్

ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు
- బొగ్గు వెలికితీతకు అభ్యంతరం లేదని వెల్లడి
- ఆర్కే 8, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మధుసూదన్

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వక్తలు కోరారు. భూగర్భ గనుల్లో బొగ్గు తవ్వకాలకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 8, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి (నిజామాబాద్) ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. స్థానిక శాంతిస్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయ 10 నుంచి ఒంటిగంట వరకు ఎస్సార్పీ 3, 3ఏ గనికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్కే 8 గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆర్కే 8గని 1993లో ప్రారంభించారు. బొగ్గు నిల్వలు పూర్తి కావడంతో అక్టోబర్, 9, 2020న మూసివేశారు. కానీ 2017లో ఎన్విరాన్‌మెంట్ యాక్ట్ అమల్లోకి వచ్చిన తరువాత నుంచి ఎన్విరాన్‌మెంట్ క్లియర్స్(ఈసీ)కోసం ఇప్పుడు ఈ ఉల్లంఘన కేటగిరీ కింద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీంతోపాటు ఎస్సార్పీ 3, 3ఏ గనులకు అనుమతులు ఉన్న దానికంటే అధికంగా బొగ్గు ఉత్పత్తి చేసాయి. 2007–08లో 7వేల టన్నులు, 2008–09లో 2 వేల టన్నులను అధికంగా ఉత్పత్తి చేయడంతో దీనికి అనుమతి లేనికారణంగా ఉల్లంఘన కేటగిరీలో వీటికి కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

సింగరేణికి సహకారం..

ఈ ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన వారంతా కంపెనీకి సహకారంగానే మాట్లాడారు. కార్మికులు, యూనియన్ నేతలు, ప్రజాప్రతినిధులు దీనికి హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. స్థానికంగా రోడ్లు బాగుచేయాలని, స్మశాన వాటిక నిర్మించాలని, వీధిలైట్లు వంటి స్థానిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా కాలుష్య నియంత్రణ మండలి(నిజామాబాద్) ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ లక్ష్మీప్రసాద్ ప్రసంగించిన వారి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం త్యాగరాజు, ఏజెంట్లు సత్యనారాయణ, గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎన్విరాన్‌మెంట్ అధికారులు కిరణ్‌కుమార్, హనుమాన్‌గౌడ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, నాయకులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కె బాజీసైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, సీఐటీయూ అధ్యక్షుడు టీ రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు భాగ్యరాజ్, అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, హెచ్ఎమ్మెస్ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

గనులతో ఇబ్బందులు ఉండవు



ప్రస్తుతం గోదావరి నుంచి వస్తున్న తాగు నీరు కలుషితంగా ఉంది. కోట్ల లాభాలు సాధిస్తున్న కంపెనీ ఉద్యోగులు, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం తాగడానికి పరిశుద్ధమైన నీటిని సరఫరా చేయాలి. భూగర్భ గనులు వల్ల ఎలాంటి కాలుష్య ఇబ్బందులు ఉండవు. సింగరేణిని రక్షించుకోవాలంటే ఇలాంటి గనులకు సహకరిస్తాం.

– టీ.వెంకట్రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

ఎలాంటి అభ్యంతరం లేదు



భూగర్భ గనులకు సంబంధించి బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. వీటికి తామెప్పుడూ సానుకూలమే. భూగర్భ జలాల సంరక్షణకోసం మరిన్ని చర్యలు చేపట్టాలి. పక్కన గోదావరినది ఉండటం వల్ల తాగునీటికి ఇబ్బంది లేకున్నప్పటికి ఆనీరు కలుషితంగా రావడం ఇబ్బందిగా మారింది. కాలనీల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరందించాలి.

– సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

సదుపాయాలు కల్పిస్తాం



రాయల్ టాకీస్ నుంచి ఎస్సార్పీ 3, 3 గని మధ్య ఉన్న రోడ్డుకు లైటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. గోదావరిలో నీరు నిల్వ ఉండటం వల్ల రంగు మారి కలుషితంగా వస్తుంది. దీని కోసం రూ.16 కోట్లతో ఆర్‌జీఎఫ్ ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

– బీ.సంజీవరెడ్డి, జీఎం శ్రీరాంపూర్